

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ



## – వసుంధర

***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

*చివరి విడత: మలి సందడి (55)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గ్‌లో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

### *స్వర్గావరోహణ పర్వం*

ఇండియాకు తిరుగు ప్రయాణంలో భాగంగా ఆఫీసులో నాకు కొన్ని ముఖ్యమైన పనులున్నాయి. వాటిలో నాకోసం ప్రత్యేకంగా తయారు చేసిన కెటలిటిక్ రియాక్టర్ని మా లేబరేటరీకి తీసుకెళ్ళే అవకాశాన్ని విచారించడం మొదటిది. విచారించవలసిన విషయం ఏమిటంటే- ఆ రియాక్టర్ ఇక్కడ లేబరేటరీకీ పనికొస్తుంది కాబట్టి- అసలా ప్రస్తావనే వద్దని రాలెక్ నాకు సూటిగానే చెబితే- నిరుత్సాహపడ్డాను.

ఐతే ప్రొఫెసర్ రాలెక్‌కి నాపట్ల విముఖత ఉందనడానికీ లేదు.

క్రిస్మస్ సెలవులకి ముందే ఆఫీసులో ఒకొక్కరికే వీడ్కోలు చెప్పినప్పుడు, అంతా నాకు శుభాకాంక్షలు చెప్పారు. రాలెక్ శుభాకాంక్షలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. 'త్వరలోన్ వాన్ హుంబోల్డ్ట్ ఫెలోషిప్ మీద ఇక్కడకొస్తావు. నాదీ హామీ' అన్నాడాయన.

ఇండియాలో నేనున్న పరిస్థితుల్ని బట్టి- ఆయన ఆఫర్ని నేనుపయోగించుకోగల అవకాశం తక్కువ. ఐతే ఆ మాట రాలెక్‌కి చెప్పలేదు.

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడని ఓ చెవిలో వినిపిస్తున్నా, నందో రాజా భవిష్యతి అని మరో చెవికి వినిపిస్తోంది మరి.

ఆఫీసులో అంతా క్రిస్మస్ పేరు చెప్పి 2-3 వారాల సెలవులు తీసుకున్నా- లూయిజీ మాత్రం తన సెలవుల్ని రెండు మూడు రోజులకే పరిమితం చేసుకున్నాడు. అతడు లేబరేటరీకి వెళ్లి కెటలిస్ట్ టెస్టింగ్ కొనసాగిస్తుంటే- రోజూ ఏదో టైములో నేనూ వెళ్లి అతడికి నా శక్తి మేరకు సాయం చేసేవాణ్ణి.

తిరుగుప్రయాణం హడావుడిలో ఉన్న నేను ఆ సమయంలోనూ లేబరేటరీకి వస్తూండడం కేవలం తనకోసమేననిపించి నొచ్చుకునేవాడు లూయిజీ. అతడు మరీమరీ ధన్యవాదాలు చెబుతూంటే, నాకది అవసరమైనకంటే ఎక్కువనిపించి ఇబ్బందిగా ఉండేది. అప్పటికీ ప్రాజెక్టు నాది కూడా కాబట్టి- నాది బాధ్యతానిర్వహణకిందే వస్తుందని పలుమార్లు చెప్పినా తన బుర్రకి ఎక్కించుకునేవాడు కాదు.

అదలాగుంచితే- సుమారు ఏణ్ణర్థం పాటు నేను చేసిన రీసెర్చి వివరాలన్నీ సేకరించడం మరో పని.

సాధారణంగా ఏ లేబరేటరీలోనైనా సైంటిస్టులకి లేబరేటరీ పనికి ప్రాక్టికల్ నోట్‌బుక్ ఉంటుంది. దాన్ని సైంటిఫిక్ డైరీలా దాచకుండా మెయింటైన్ చెయ్యడం నా అలవాటు. అంటే అందులో- చేస్తున్న ప్రయోగాల వివరాలూ, వాటి ఫలితాలతోపాటు- రోజూ ఏంచేస్తున్నదీ, ఏం చెయ్యబోతున్నదీ వివరంగా రాస్తాను. ప్రొఫెసరుతో, సాటివారితో జరిపిన వైజ్ఞానికపరమైన చర్చల వివరాలూ అందులో ఉంటాయి.

ఐతే ఎక్కువమంది ఆ నోట్‌బుక్‌లో ప్రయోగాల్నీ, ప్రయోగఫలితాల్నీ మాత్రమే రాస్తుంటారు. నేను మాత్రం- విశాఖపట్నంలో పిహెచ్‌డి కాలం నాటినుంచీ ఆ నోట్‌బుక్కుని డైరీలాగే మెయింటైన్ చేసేవాణ్ణి. ఆ పుస్తకం చదివితే- వేరెవరైనా నా ప్రయోగాల్ని ఎలా మొదలెట్టానో తెలుసుకోవచ్చు. నేనెక్కడ ఆపానో అక్కణ్ణించి కొనసాగించవచ్చు. కొన్ని భావి ప్రయోగాలకు ప్రేరణ కూడా పొందవచ్చు.

పిహెచ్‌డికి ఐతే ఆ పుస్తకాలు నా స్వంతమే కానీ, ఉద్యోగరీత్యా చేసే సైంటిఫిక్ వర్క్ విషయంలో- అవి ఆ సంస్థ ఆస్తి. సంస్థను వదిలి వెడుతున్నప్పుడు ఆ పుస్తకాల్ని సంస్థ లైబ్రరీలో నమోదు చేయాలి.

నేను జర్మనీకి బయల్దేరినప్పుడు అలాంటి మూడు పుస్తకాల్ని అక్కడ లైబ్రరీలో అప్పగించి వచ్చాను. తిరిగి వెళ్లేక మళ్లీ తీసుకోవచ్చు.

ఇక్కడ బెర్లిన్ లేబరేటరీలో ఒక్క ఏడాదిలోనే నావి మూడు పుస్తకాలున్నాయి. వాటిలో ప్రయోగ ఫలితాలతో పాటు- గతానికీ, భావికీ సంబంధించిన విలువైన సమాచారముంది. ఆ పుస్తకాల్ని సంస్థకి అప్పగించేముందు- వాటి పేజీలన్నింటినీ జిరాక్సుగా తీసుకుందుకు అనుమతి కోరాను. అందుకు రాలెక్ వెంటనే ఒప్పుకోవడమే కాక, 'అవి నీ రీసెర్చికి సంబంధించిన

విశేషాలు. వాటిమీద నీకు హక్కుంది. ఎటొచ్చీ ఇలా అనుమతి కోరి ఆ వివరాలు తమతో తీసుకువెళ్లినవాళ్లు అరుదు' అన్నాడాయన.

నాకు తెలిసిందేమిటంటే- ఇలాంటి స్కాలర్‌షిప్పు మీద వచ్చినవాళ్లలో కొందరు రీసెర్చిని సీరియస్‌గా తీసుకోరు. సీరియస్‌గా తీసుకున్నవాళ్లలో కొందరు- తమకు కాన్ఫిడెన్షియల్ అనిపించిన సమాచారాన్ని నోట్సులోకి ఎక్కించకుండా వేరే వ్రాసుకుంటారు.

అటు సంస్థ పట్లా, ఇటు రీసెర్చిపట్లా- నిజాయితీగానూ, అంకితభావంతోనూ వ్యవహరించానని రాలెక్ నన్ను మెచ్చుకున్నాడు.

నిజాయితీ నా వ్యక్తిత్వంలో భాగం. నాకు తెలిసి సామాన్యుల్లో నావంటివారే ఎక్కువ. అంకితభావం విషయానికొస్తే- నాకు రీసెర్చి బ్రతుకు తెరువు. ఆమేరకు నిజాయితీగా బాధ్యతను నిర్వహిస్తాను. అలా నేనో సామాన్య శాస్త్రజ్ఞుణ్ణి.

అంకితభావం విషయానికొస్తే- నాకు రీసెర్చికంటే వ్యక్తిగత జీవితమే ప్రధానమని ఒప్పుకోకపోతే నా నిజాయితీకి అర్థంలేదు.

జిరాక్సు చేసిన కాగితాల్ని ఇంటికి తెచ్చేసుకున్నాను.

లేబరేటరీలో నా పేరున ఉన్న వస్తువులన్నీ క్రిస్మసుకి ముందే వెనక్కిచ్చేసి- నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకున్నాను.

క్రిస్మస్ సందర్భంగా ఇంచుమించు నిర్మానుష్యమైన లేబరేటరీ బావురుమంటున్నా- నగరం మాత్రం దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

సంపన్న దేశం. వైభవ ప్రదర్శనకు అలవాటుపడ్డ జనం. అతిముఖ్యమైన పండుగ.

ఊరంతా అలంకరణలు. ఇంట్లో ఏంచేస్తారో తెలియదు కానీ, ఇల్లు దాటి బయటకొస్తే, పెద్దపండుగ జరుపుకుంటున్న ఉమ్మడి కుటుంబంలోకి ప్రవేశించినట్లుండేది. రాత్రిళ్లు రంగుల హరివిల్లులో సంచరిస్తున్నట్లుండేది.

బెర్లిన్ నగరానికి చిహ్నం ఎలుగుబంటి. బెర్లినర్ బేర్ పేరిట ఎన్నో సోవనీర్లను అమ్మేవారు.

నగరంలో ఎలుగుబంటిలా వేషం వేసుకుని కొందరు తిరిగేవారు. వారు కనిపించినవారిని ఆప్యాయంగా సమీపించి కరచాలనం చేసేవారు. అలా కరచాలనం చేస్తూ చాలామంది ఫొటోలు తీసుకునేవారు.

మేము కూడా అలా ఫొటోలు తీసుకున్నాం. బాబు మాత్రం ఎలుగుబంటిని చూసి బయటపడి అమ్మ కొంగు చాటుకి వెళ్లిపోయాడు. పాప మేకపోతు గాంభీర్యంతో ముందుకెళ్లి- ఒకడుగు వెనక్కు వేస్తూ చేయి జాపి కరచాలనమిచ్చింది.

క్రిస్మస్ సమయంలో సకుటుంబంగా అక్కడ గడపడం జీవితంలో మరచిపోలేని గొప్ప అనుభవం.

ఇక ప్రయాణం విషయానికొస్తే-

శ్రీమతికి అంత ఆనందంగా లేదు. మళ్లీ తనూ, పిల్లలూ నేను లేకుండా విమాన ప్రయాణం చెయ్యాలంటే ఆమెకు అధైర్యంగా ఉంది.

"హనుమంతుడిలా నీ సామర్థ్యం నీకు తెలియక ఊరికే బెంగ పడుతున్నావు" అని- బెర్లిన్ చేరడానికి తను చేసిన సాహసయాత్రని గుర్తు చేసి, "అప్పటితో పోలిస్తే, ఇప్పుడీ ప్రయాణం నీకు నల్లేరుపై బండి నడక" అని ప్రోత్సహించాను.

“ఎన్ని చెప్పండి! మీరు లేకుండా పిల్లలతో నేనొక్కత్తినీ మళ్ళీ ప్రయాణం చెయ్యడమంటే- పాప బెర్లినర్ బేర్‌కి షేక్‌హ్యాండు ఇవ్వడం లాంటిదే నాకు” అంది శ్రీమతి.

తనకు ఎలా ధైర్యం చెప్పాలని అనుకుంటుండగా, ఓ ఇండియన్ మిత్రుడు మాకు శ్యామలరావు అనే కొత్త మిత్రుణ్ణి పరిచయం చేశాడు.

శ్యామలరావు నాకంటే కొంచెం పెద్దవాడు. ఆయనకి ఇద్దరు పిల్లలు. వాళ్ళూ మా పిల్లలకంటే పెద్దవాళ్ళు. విశేషమేమంటే- ఆయన కూడా సకుటుంబంగా ఇండియా వెడుతున్నాడు. అదీ శ్రీమతి వెళ్లే విమానంలోనే!

ఆయన్ని ఇంటికి విందుకు ఆహ్వానించాం.

శ్యామలరావు సహృదయుడు. స్నేహపాత్రుడు. కలుసుకున్న కాసేపటికే మా కుటుంబం, వారి కుటుంబం సన్నిహితులమైపోయాం.

“ప్రయాణం గురించి బెంగ పెట్టుకోకు చెల్లెమ్మా! ఫ్రాంక్‌ఫుర్ట్‌లో మీవారు నిన్ను విమానం ఎక్కించేక- బొంబాయిలో నిన్ను మీవాళ్లకి అప్పగించే పూచీ నాది” అన్నాడాయన.

ఆ మాటలకు శ్రీమతి మొహంలో కొత్తగా ప్రవేశించిన ధైర్యాన్ని చూసేక- నాకూ కొంత ఊరట కలిగింది.

వాళ్లు వెళ్లేక, “అంతా నీ సంకల్పబలం. తిరుగు ప్రయాణంలో అన్నీ నువ్వనుకున్నట్లే జరుగుతున్నాయి” అన్నాను శ్రీమతితో.

ఆమె ఒప్పుకోలేదు, “నా సంకల్పానికే అంత బలముంటే- మీరే నాతో వచ్చేవారు” అంది. నేనిక ఆ ప్రస్తావన మానుకున్నాను.

కలకత్తాలో ఉండే అన్నయ్యనుంచి ఉత్తరం వచ్చింది. తను బొంబాయి వచ్చి శ్రీమతిని రిసీవ్ చేసుకుంటానని. అన్నీ సజావుగా జరిగి పోతున్నాయని ఉత్సాహం కలిగినా- ఆ మాట శ్రీమతి వద్ద అనలేదు. నేను తనతో కలిసి ప్రయాణం చెయ్యడం లేదుగా...

ఎయిర్‌మెయిల్, సీమెయిల్ పార్సెల్సు పంపడం ఐపోయింది. కానుకలు కొనడం ఐపోయింది. ఇంట్లో సర్దుళ్లు ఐపోయాయి. ఆఫీసులో అందరితో వీడ్కోలు ఐపోయింది. ఆఫీసుకీ వీడ్కోలు ఐపోయింది. బెర్లిన్‌లోని ఇండియన్ మిత్రులకీ వీడ్కోలు ఐపోయింది.

విశేషమేమంటే- నగరమంతా క్రిస్మస్ వేడుకల్లో తలమునకలై ఉంటే- ఒలోముచ్‌కీ మాత్రం లూయీజీ అంత శ్రద్ధగా తన డ్యూటీ చేసుకుపోతోంది. ఉదయమే తొమ్మిది లోపులో బయటకు వెళ్లిపోతుంది. రాత్రి తొమ్మిదికి కాస్త అటూ ఇటూలో తిరిగొస్తుంది.

క్రిస్మస్ రోజున మాత్రం ఆమె ఇంట్లోనే ఉంది. ఆరోజు మమ్మల్ని తన వాటా గదికి పిలిచింది.

“మీరంతా నాకు నచ్చారు. మీరు వెళ్లిపోతున్నారంటే నాకు చాలా బాధగా ఉంది” అందామె.

ఆమెనుంచి అలాంటి సెంటిమెంటల్ డైలాగ్ వింటానని ఊహించలేదు. అందుకే ఆశ్చర్యపడుతుంటే, ఆమె రుమాలు తీసుకుని కళ్లొత్తుకోవడం నాకు పెద్ద షాక్.

ఆ ఇంట్లో మావాళ్లున్నది ఏడాది. కలుసుకుని మాట్లాడిన సందర్భాలు మూడో నాలుగో ఉంటాయి. అవీ ఆత్మీయతకు సంబంధించి కాదు. పిల్లాడు నవ్వాడన్న ఫిర్యాదో, అడ్వాన్సు కావాలన్న రిక్వెస్టో!

ఆమె వృత్తి కూడా సంసారపక్షం కాదు. సెక్స్ కీనోలో (పోర్న్ సినిమాలు చూపించే థియేటర్సు) టికెట్లు అమ్ముతుంది.

ఆమెనుంచి ఇలాంటి సెంటిమెంటు బయటపడ్డంతో నా మనసు చెమర్చింది.

ఆమె మా పిల్లల్ని దగ్గరగా తీసుకుంది. వాళ్లకి ఓ గుడ్డ బొమ్మ ఇచ్చి, "నా గుర్తుగా ఉంచుకోండి" అంది. తర్వాత శ్రీమతిని దగ్గరగా తీసుకుని ఆప్యాయంగా భుజం తట్టింది.

"మీరు వెళ్లే రోజున ఆ సమయానికి బహుశా నేను ఇంట్లో ఉండను. తాళాలు హెర్ షేరర్‌కి అప్పగించండి. ఇదే మీకు నా వీడ్కోలు" అంటూ ఆమె నాకు షేక్‌హాండ్ ఇచ్చింది.

అక్కణ్ణించి షేరర్ నాతో బయటకొచ్చి, "ఈరోజు చాలా పెద్ద విశేషం. ఒలోముచ్‌కీని ఇంత సెంటిమెంటల్‌గా ఎప్పుడూ చూడలేదు" అని- మా అందరితో కరచాలనం చేసి, "నేనూ మిమ్మల్ని బాగా మిస్సవుతాను. కానీ ఒలోముచ్‌కీలా కళ్లు తుడుచుకోను" అని నవ్వేసి అంతలోనే అప్రయత్నంగా కళ్లు తుడుచుకుని వెళ్లిపోయాడు.

మా వాటాలోకెళ్లగానే పిల్లలు కొత్త బొమ్మతో ఆటలో పడ్డారు. ఆ గుడ్డ బొమ్మ మొహం తమాషాగా జోకర్‌లా ఉంది. కాళ్లూ చేతులూ తలా మొండెం అన్నీ వేలాడుతూ ఎలా కావాలంటే అలా వంగుతూ ఊగుతున్నాయి. పిల్లలకది వినోదంగా ఉంది.

శ్రీమతి నాతో, "సెక్స్ కీనోలో టికెట్లమ్మే మనిషికి ఇంత సెంటిమెంటా?" అంది.

అది నిరసన కాదు. తిరస్కారభావం కాదు. కేవలం ఆశ్చర్యం.

సెక్స్ కీనో అక్కడి సంస్కృతిలో ఒక భాగం. అనేకులకు దినచర్యలోనూ ఒక భాగం. ఎంతలా అంటే- క్రిస్మస్ వేడుకల సమయంలో కూడా- వైనాక్టెన్ పేరిట రెండు రోజులు తప్ప- ఏడాది పొడుగునా ఇంచుమించు అన్ని రోజులూ అవి తెరచి ఉంటాయి. అంటే జనాల్లో అక్కడ వాటికి అంత ఆదరణ ఉంది.

ఏడాది పొడుగునా ఇంచుమించు అన్ని రోజులూ ఒలోముచ్‌కీ అక్కడ టికెట్లు అమ్ముతోందంటే- అదామె సేవాగుణం కింద రాదా?

ఇలా నేను వివరిస్తే శ్రీమతి నవ్వేసి, "ప్రతీదీ తిరకాసుగా ఆలోచించడం మీకు అలవాటే కదా!" అంది.

ఏమైతేనేం- ఒలోముచ్‌కీకి వీడ్కోలు చెప్పడం కూడా ఐపోయింది. ఇక బెర్లిన్ నగరానికి వీడ్కోలు చెప్పాలి.

ఇక్కడికొచ్చేవరకూ నేను చాలా ఎక్కువగా మసలిన ఊళ్లు మూడే మూడు. రాజమండ్రి, విశాఖపట్నం, భువనేశ్వర్.

కాలినడకపై ఎక్కువ ఆధారపడ్డం వల్లనేమో ఆ ఊళ్లలో చాలా ప్రాంతాల్లో కళ్లకు గంతలు కట్టి వదిలేసినా మసలగలను.

ఇప్పుడు బెర్లిన్ అలాగైపోయింది.

అలాగైపోవడమంటే- మసలడానికి మాత్రమే కాదు. అదో అనుబంధం.

రైల్వే స్టేషన్. కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్, ఎర్న్‌స్ట్ రాయిటర్ ప్లాట్జ్, డాయిచే ఓపర్, చార్లోటెన్‌బర్గ్ ప్యాలస్, విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసే- ఈ పరిధిలో రోజూ కొన్ని కిలోమీటర్లు కాలినడకన చుట్టేస్తుండే ప్రాంతాలు.

ఆ అనుబంధం మనసుకే కానీ మాటలకి అందదు.

రాజమండ్రిని వదిలినప్పుడు మనసు అంతగా చలించిపోలేదు. ఎందుకంటే- అది నేను పుట్టిపెరిగిన ప్రాంతం. తరచుగా వస్తూ పోతూ ఉంటాను. కానీ విశాఖపట్నం అలా కాదు.

అక్కడికి నేను పైచదువులకోసం వచ్చాను. కొత్తగా సంసారం కూడా ప్రారంభించాను. ఊళ్లోని వీధివీధితోనూ నడక అనుబంధముంది.

ఉద్యోగం కోసం విశాఖపట్నం వదిలి భువనేశ్వర్ వెడుతున్నప్పుడు- గుండెలు పిండినట్లయింది. కన్నీళ్లు ఆగలేదు.

మళ్లీ అక్కడకు వచ్చే అవకాశాలు తక్కువనే కాదు. స్వరాష్ట్రాన్ని వీడి వెడుతున్నానన్న భావన కూడా మనసును కలచివేసింది.

ఇప్పుడు అలాంటి భావన బెర్లిన్ వదిలి వెడుతుంటే కలిగింది.

ఊరితో అనుబంధం. ఊరివాళ్లతో అనుబంధం.

ఆ అనుబంధాలకి శాశ్వతంగా దూరమౌతున్నాను. గుండె బరువెక్కదూ!

బెర్లిన్లో మరో ముఖ్యానుబంధం ఎస్సెస్ రావుగారిది కదా! చివరిసారిగా వాళ్లింట్లో కలుసుకున్నప్పుడు- "మీ ప్రయాణం రోజున- మై కార్ ఈజ్ యట్ యువర్ సర్వీస్" అన్నాడు రావుగారు.

"సామాను ఎక్కువుంది. కారు సరిపోదు. టాక్సీలో వెడతాం" అన్నాను వెంటనే.

"టాక్సీలేం మా కారుకంటే పెద్దవిగా ఉండవు. మీకూ, మీ సామానుకీ చెరో టాక్సీ కావాలి. కాబట్టి ఓ టాక్సీని బుక్ చేద్దాం. ఓదాంట్లో సామాను, మరోదాంట్లో మనుషులు" అన్నాడు రావుగారు.

"మీకెందుకండీ శ్రమ! రెండు టాక్సీల్ని బుక్ చేద్దాం" అన్నాను.

శ్రీమతి సత్యవతి నవ్వి, "నేనూ అదే మాటన్నాను. మాకు మాత్రం స్టేషనుకి రావాలనుండదా! రెండు టాక్సీల్ని బుక్ చేద్దామన్నా. కానీ ఈయనో పెద్ద పిసినారి- తను ఖర్చు పెట్టరు. ఎదుటివాళ్లని ఖర్చుపెట్టనివ్వరు" అంది.

ఐతే అసలు కారణం వేరే ఉంది.

వాళ్ల పిల్లలు బాగా చిన్నవాళ్లు. ఇంట్లోనైనా ఉండాలి. లేదా ఎవరింట్లోనైనా ఫరవాలేదు. రైల్వే స్టేషన్ లాంటి చోట వాళ్లని సముదాయించడం ఇబ్బంది.

"మనం వెడుతున్నది సాయానికి. పిల్లలతోనే సరిపోతే వాళ్లకేం సాయపడతాం" అని రావుగారు అనడంతో- ఆయనొక్కరే స్టేషనుకి వస్తారని అంతకుముందే నిర్ణయం ఐపోయింది.

ఈ విషయం మాకు ముందే తెలియడంవల్ల ఆమె మాటలు ఆ దంపతుల సరస భాషణలని గ్రహించినా, "రావుగారిపై పిసినారి ముద్ర అన్యాయం. మాకోసం ఆయనే రెండు టాక్సీలు బుక్ చేస్తారు" అన్నాను.

"మహానుభావా! ఇక్కడ ఇంకో ఇబ్బంది ఉంది. టాక్సీలో ఐతే సామాను డిక్కీలోనే తప్ప సీట్లపై పెట్టనివ్వరు. అందుకని మీ సామాను మా కార్లో, మీరు టాక్సీలో- అదీ సంగతి" అని విషయానికొచ్చాడు రావుగారు.

"సామానుకని ప్రత్యేకంగా టాక్సీని బుక్ చెయ్యలేమా?" అన్నాను.

"మీకు టాక్సీలోనే వెళ్లాలని మరీ మనసుగా ఉన్నట్లుంది. మా కారుకి టాక్సీ బోర్డు తగిలిస్తా లెండి" అన్నాడు రావుగారు నవ్వుతూ.

మరి వాదనలు పెంచలేదు. ఈ అభిమానానికీ, ఆత్మీయతకూ శాశ్వతంగా దూరమౌతున్నామన్న బాధ మాత్రం రెట్టింపయింది.

ప్రయాణం రోజు రాత్రి పెందరాళే భోంచేశాం. మర్నాటికోసం పులిహోర ఉప్పుపిండి, పెరుగన్నం ప్యాక్ చేసుకున్నాం.

రావుగారు తనింటినుంచి ఫోన్ చేసి- టైము అడ్రసు చెప్పి- టాక్సీ మా ఇంటికొచ్చేలా బుక్ చేశాడు.

టాక్సీకంటే కాస్త ముందుగానే మా ఇంటికొచ్చి సామాను కిందకి దింపడంలో సాయం చేశాడు.

ఐక్కగా ఉండే హెర్ షేరర్ కూడా సామాను దింపడంలో కొంత సాయం చేశాడు.

టాక్సీ సరిగ్గా అన్న టైముకే వచ్చింది.

సామాను రావుగారి కారు డిక్కీలోనూ, సీట్లలోనూ పెట్టగా మా టాక్సీ డిక్కీ కూడా కొంచెం అవసరమైంది.

సామానుతో బెర్లిన్ స్టేషన్లో దిగగానే- ల్యూనబర్గ్ నుంచి బెర్లిన్ వచ్చిన రోజు గుర్తుకొచ్చింది.

అప్పుడు అదంతా కొత్త.

ఎదురుగా కనబడే 21 అంతస్తుల ఐరోపా సెంటర్ కొత్త. క్రమశిక్షణకు మారుపేరైన సంపన్నదేశంలో- రైల్వే స్టేషన్లో తాగుబోతులు తిరుగుతుండడం కొత్త.

ఇప్పుడవన్నీ పాతబడ్డాయి.

మేము అలవాటుపడ్డ ఆ పరిసరాలన్నీ- 'మిత్రమా! ఇవి మనకు చివరి చూపులు' అంటున్నట్లు తోచింది.

పదహారు నెలల్లో జీవితానికి సరిపడ అనుభవాల్ని మూటకట్టి ఇచ్చిన ఆ మహానగరానికి వీడ్కోలు చెబుతూ ప్లాట్‌ఫాం చేరాను.

నిముషం కూడా తప్పకుండా ట్రయిన్ టైముకి వచ్చింది.

మేమెక్కాల్సిన బోగీని సులభంగానే గుర్తించాం.

ఊబాన్ అనుభవంతో- శ్రీమతి, పిల్లలు అవలీలగా ట్రయినెక్కారు. నేను, రావుగారు కలిసి సామాను మా బోగీలోకి తరలించేశాం.

రద్దీ లేకపోవడంవల్ల బోగీ చాలా విశాలంగా అనిపించింది.

రావుగారికి వీడ్కోలు చెప్పడం అయింది. ఆ మహానుభావుణ్ణి జీవితంలో మళ్లీ ఎప్పుడైనా ఎక్కడైనా కలుస్తామో లేదో తెలియదు.

ఆ క్షణంలో కలిగినది మాటలకందని అనుభూతి.

ట్రయిన్ కదిలింది.

జర్మనీలో ఒక ఊర్నించి మరో ఊరికి దూరప్రయాణం చేసే ట్రయిన్ ఎక్కడం మావాళ్లకి అదే మొదటిసారి. బహుశా చివరిసారి కూడా!

నాలోనూ శ్రీమతిలోనూ ఏదో తెలియని ఉద్వేగం. పిల్లలకేముంది- తలిదండ్రులం పక్కనున్నాం కదా! వాళ్లలో ఉత్సాహమూ, కుతూహలమూ ప్రస్ఫుటమౌతున్నాయి.

వాళ్లు మాముందు సీట్లలో కూర్చున్న యువ జంటని కుతూహలంగా చూస్తున్నారు.

ఇద్దరూ తెల్లవాళ్లు. వాళ్లు ప్రేమికులని తెలుస్తూనే ఉంది. ఒక మనిషి నడుం వాల్చుకునేటంత చోటున్న సీట్లో- ఒక్కరికి కూడా చోటు లేదన్నట్లు ఇద్దరూ ఒకరినొకరు హత్తుకుని కూర్చున్నారు.

రంగులో, దుస్తుల్లో, వేషధారణలో, తనుభాషలో- తమకు పూర్తి భిన్నంగా కనబడుతున్న మమ్మల్ని వాళ్లు కుతూహలంగా చూస్తున్నారు.

శ్రీమతి చీరలో ఉంది. బొట్టు పెట్టుకుంది. చేతికి గాజులు. నాకు కాస్త దూరంగా, మొహమాటంగా కూర్చుంది.

మా నలుగురిలో వారికి మరీ భిన్నంగా అనిపించింది శ్రీమతే!

కుతూహలం ఎంత ఉన్నా- ఎక్కువసేపు చూడ్డం మర్యాద కాదని ఆ జంటకు మాత్రం తెలియదా!

మానుంచి దృష్టి మళ్లించుకుందుకు ఆమె తన ప్రియుడితో కబుర్లు మొదలెట్టింది.

జర్మనీలో యువతీ యువకులు కలిసి ప్రయాణం చేస్తున్నప్పుడు- యువతులు నోరు విప్పితే ఆగకుండా మాట్లాడ్డం చాలాసార్లు చూశాను. అలాంటి సందర్భాల్లో యువకులు తలూపుతూ, చిరునవ్వులు చిందిస్తూ స్పందించడం కద్దు.

ఆ యువతులు ఏం మాట్లాడుతున్నారో విని మనసులో అనువదించుకోవాలనుండేది.

అసలే నా భాషా పరిజ్ఞానం అంతంతమాత్రం. ఆపైన బయట వివిధ శబ్దాలు. అందువల్ల నా కోరిక తీరలేదు.

అవి విని అర్థం చేసుకుని ఉంటే- 'ఆచార్యదేవా, ఏమంటివేమంటివి' వంటి సుదీర్ఘ సంభాషణల్ని- మన సినిమాల్లో ప్రేమికులకు కూడా అన్వయించేలా- సినీ రచయితలకు మార్గదర్శకం చెయ్యగలిగేవాణ్ణి.

ఆమె మాట్లాడుతోంది. అతడు సైగలతో స్పందిస్తున్నాడు.

మాట్లాడుకుంటూ మేము వారిని గమనించీ గమనించనట్లున్నాం. వాళ్లూ మావిషయంలో అంతే!

ట్రయిన్ కదిలి పది నిముషాలు గడిచిందో లేదో- ఆ ప్రేయసీప్రియుల తనుభాషలో మార్పు చోటు చేసుకుంది.

ఏం జరగబోతోందో తెలుసు.

అప్రయత్నంగా పిల్లల్ని చూశాను.

వాళ్లకి ఆ జంటపై ఆసక్తి పోయినట్లుంది. ఇద్దరూ ఒకరికొకరు అభిముఖంగా కూర్చుని ఏవో ఆడుతున్నారు.

శ్రీమతిని చూస్తే- ఆమె ఓసారి ఆవులించి వెనక్కి జారగిలబడింది.

నిద్ర వస్తోందో, నటిస్తోందో తెలియదు. కానీ మా ఎదుట ఏం జరుగనున్నదో ఆమెకీ తెలుసు.

ఇప్పుడా జంటకి ఎదుట మేమున్నామన్న స్పృహ లేదు. వారి లోకం వారిది.

ఆమె తన ముఖాన్ని అతడికి దగ్గరగా చేరుస్తోంది. అతడు వెనక్కి తగ్గుతున్నాడు.

అసలే చలి దేశం. ఆపైన శీతాకాలం.

ఆమె ఊపిరి వెచ్చదనం ఆ చలి వాతావరణానికి లొంగక- అంత వేడిగానూ నా సీటుకి చేరి నన్ను తాకుతోంది.

చొరవ ఆమెది. అనాసక్తత అతడిది అనిపిస్తున్నా- ఆ జంట ఆలింగనం దీర్ఘ చుంబనానికి దారితీసినప్పుడు- అతడి చేతులు ఆమె చుట్టూ బలంగా బిగిశాయి.

ఇలాంటివి చూడ్డం ఇక్కడ నాకేం కొత్త కాదు. ఐనా అప్రయత్నంగా, "పడక గదికీ, పదిమందిలో ప్రయాణానికీ తేడాతెలియని- ఇదేం సంస్కృతి?" అనిపించింది.

చటుక్కున మా వాళ్లని చూస్తే- పిల్లలు అప్పుడే నిద్ర పోతున్నారు.

శ్రీమతి కూడా వెనక్కి వాలి నిద్రపోతోంది. అది నటన కాదని మొహం చూస్తేనే తెలుస్తోంది.

అంటే- ఎదుటి జంటని ఆమె సాధారణంగా తీసుకుందా? మరి నేనెందుకు అలా తీసుకోలేకపోయాను?

“ఇన్నాళ్లున్నారు. ఇంకా వీళ్ల సంస్కృతిని అర్థం చేసుకోలేదా? ఇదేం సంస్కృతి మీది” అంటున్నాయి శ్రీమతి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

నేనిక ఆ జంటని పట్టించుకోలేదు. క్రమంగా నాకూ నిద్ర పట్టింది.

ఒక రాత్రివేళ మెలకువొచ్చి చూస్తే- ఆ ప్రేయసీ ప్రియులు కూడా నిద్ర పోతున్నారు. ఒకరికొకరు దగ్గరగా కాదు- తగినంత దూరంలోనే!

అలా ఆ రాత్రి గడిచి తెల్లారేసరికి ట్రయిన్ ఫ్రాంక్‌ఫుర్ట్ చేరింది...

ఫ్రాంక్‌ఫుర్ట్ ముచ్చట్లు వచ్చే నెల...

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments